# దైవము అందరివాడు

**ఆత్మతత్త్వ మెరుగ ఆనంద మబ్బును**
**తత్త్వమెరుగకున్న తాపమబ్బు**
**బ్రహ్మ నెరిగినంత బ్రహ్మయే తానగు**
**ఉన్నమాట తెలుపుచున్నమాట**

**మృత్పిండమేకం బహు భాండరూపం**
**సువర్ణమేకం బహు భూషణాని**
**గోక్షీరమేకం బహు ధేనురూపం**
**ఏకం పరమాత్మ బహు దేహవర్తి**

దివ్యాత్మ స్వరూపులారా!

మట్టి ఒక్కటేగాని, కుండల రూపములు భిన్నములు. సువర్ణము ఒక్కటేకాని ఆభరణములు వివిధమైన రూపములు ధరిస్తుంది. గోవుల రంగులు భిన్నములుగాని గోక్షీరము తెలుపు రంగు. ఆత్మ ఒక్కటే, అయితే మానవత్వమందు భిన్నభిన్న రూపములు ధరించి ప్రకటిస్తూ వుంటుంది. ప్రతిజీవియందును అంతర్భూతముగా ప్రకటింపబడే దేవుడు ఒక్కడే. అతడే సత్యస్వరూపుడు. అతడే అనంత ప్రభువు.

## ఏ పదార్థమును ఏ వ్యక్తికూడా సృష్టించలేదు

సత్యము ఒక్కటైనప్పటికిని అనుభవములో దానిని అనేక విధములుగా అనుభవిస్తూ వచ్చారు. 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి'. ఉన్న సత్యము ఒక్కటైనప్పటికి వారివారి అనుభూతులను, వారివారి అనుభవములను పురస్కరించుకొని భగవంతునికి అనేక రూపనామములు కల్పించుతూ వచ్చారు. అయితే మూలాధారమును ఎవ్వరును మార్చలేరు. భగవంతునియొక్క తత్త్వాన్ని అర్థము చేసుకొనలేనివారు అనేకులు. అర్థము

sri sathyasai vachanamrutam

చేసుకున్నట్టుగా అభినయము చేసేవారు మరింత అధికులు. కానీ, దైవత్వమును ఎవ్వరు ఏనాటికి పరిపూర్ణముగా అర్థము చేసుకొనలేరు. 'యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' అన్నవి, ఉపనిషత్తులు. మనస్సునకుగానీ, వాక్కునకుగానీ అతీతమైన దివ్యత్వాన్ని, పవిత్రతను ఎవరు ఏ రీతిగా వర్ణించగలరు? ఏ రీతిగా చిత్రించగలరు? మానవ జీవితమునకు అవసరమైన వస్తువులనన్నింటిని భగవంతుడు వుచితముగా సృష్టిస్తూ వచ్చాడు. మట్టి, నిప్పు, గాలి, నీరు, సూర్యకాంతి. అయితే, భగవంతుడు అనుగ్రహించి ప్రసాదించిన యీ పదార్థములనుండి వ్యక్తిస్థాయిలో వైజ్ఞానికుడు అనేక విధములైన రూపనామములు సృష్టిస్తూ వచ్చాడు. యీనాడు వైజ్ఞానికుడు యీ పదార్థములను తాను సృష్టిస్తున్నట్టుగా భ్రమిస్తున్నాడు. ఏ పదార్థమును యే వ్యక్తికూడా సృష్టించలేడు. ఉన్నదానికే వివిధ రూపములను యేర్పరచి భిన్న భిన్నమైన మార్గములను ప్రబోధిస్తూ వస్తున్నాడు.

**పదార్థమును సృష్టించటముగాని, నిర్మూలము చేయటంగాని మానవుని చేతిలో లేదు**

నీరులో నిప్పు వున్నది. వైజ్ఞానికుడు తన విజ్ఞానశక్తిచేత దానినుండి విద్యుత్‌శక్తినికూడను ప్రసరింపజేయుచున్నాడు. కానీ, యీ విద్యుత్‌శక్తి యీ వైజ్ఞానికుడు సృష్టించినదికాదు. అగోచరమై గుప్తముగా వుండిన శక్తిని తాను వ్యక్తము చేస్తూ వచ్చాడు. అసలు ఈ నీరునందే విద్యుత్‌శక్తి లేకుండిన తాను యేమాత్రముకూడను దీనిని సృష్టించలేడు. ప్రతి పదార్థమునందును గుప్తముగా గోప్యముగా వుండిన తత్త్వమును వ్యక్తీకరింప జేసే వ్యక్తులు యీనాడు అధికమైపోతూ వచ్చారు. దీనిని ఆధారముగా గొని వైజ్ఞానిక శాస్త్రము విరివిగా పెరుగుతున్నదని మనము విశ్వసిస్తున్నాము. కానీ యీ యొక్క ఉత్పత్తిని మానవుడు ప్రత్యేకముగా తాను లేనిదానిని సృష్టించినట్లుగా భ్రమించటము అజ్ఞానము. భూమిలో అట్టడుగున జలమున్నది. ఆ జలమును యీ వైజ్ఞానికుడు సాంకేతిక విజ్ఞానముతో పైకి తెప్పిస్తున్నాడు. ఆ జలము పూర్వము వున్నదేగానీ క్రొత్తగా ఎవరూ ప్రత్యేకముగా సృష్టించలేదు. అదే విధంగా, అప్పటికే వున్న మూలధాతువును తాను సంహారము చేయలేడు. పదార్థమును నిర్మూలనము గావించటముగానీ, నిర్మాణము గావించటముగానీ మానవుని చేతిలో లేదు. ఈ యొక్క దివ్యతత్త్వాన్ని ప్రతి వ్యక్తికూడను గుర్తించనప్పుడే

దైవత్వమనేది సర్వత్ర వ్యాపించినదనే సత్యాన్ని అర్థము చేసుకోగలడు. Matter can neither be created nor destroyed. మానవుడే దీనికి కారణమని భావించటము కేవలము మానవునియొక్క భ్రమ మాత్రమే!

## భ్రమ ఉండినంతవరకు బ్రహ్మను దర్శించలేరు

దివ్యత్వమనేది అనాదినుండికూడను మనకు అగోచరముగానే వుంటున్నది. భూమికి ఆకర్షణశక్తి సహజమైనది. కానీ, న్యూటన్ పరిశోధనలచేత దీనిని ప్రకటితము గావించాడు. ఈ ఆకర్షణశక్తి న్యూటన్ ప్రకటించక పూర్వముకూడను భూమి యందున్నది. అదే విధముగనే దైవశక్తి గుప్తముగా, గోప్యముగా సర్వత్రా వుండినప్పటికిని వారివారి సాధనా సంపత్తిద్వారా సాక్షాత్కరింప చేసుకోగలుగుచున్నారు. మానవులయందు అనేక తెగలు, అనేక మతములు, అనేక కులములు, అనేక వర్ణములు వుండినట్లుగా మనము భావిస్తున్నాము. ఇవన్నియుకూడను మానవునియొక్క భ్రమలే! ఈ విధమైన భ్రమలు మానవునియందు వుండినంతవరకుకూడను బ్రహ్మను తాను దర్శించలేడు. సత్యము ఒక్కటే! యిది బ్రాహ్మణుల సత్యము, క్షత్రియుల సత్యము, భారతీయుల సత్యము, అమెరికావారి సత్యము, రష్యావారి సత్యము అని యీ సత్యమును ఒక దేశమునకు, ఒక కాలమునకు, ఒక తెగకు, ఒక కులమునకు పరిమితము చేయలేరుకదా! అదే విధముగనే నిప్పు, నీరుయొక్క తత్త్వములుకూడను. యిది బ్రాహ్మణుల నిప్పు, యిది శూద్రుల నిప్పు, యిది క్షత్రియుల నిప్పు, యిది భారతీయుల నిప్పు, యిది విదేశీయుల నిప్పు అని దీనికి ఎట్టి భేదములు లేవుకదా! గంగది ఏకులము? గాలిది ఏ కులము? అందరు అనుభవిస్తున్నాముకదా! ఇదే విధముగనే దైవత్వమనేది ఏకత్వమై వుండినప్పటికి మనయొక్క భ్రాంతులచేత భిన్నత్వముగా విభజించి దానిని భ్రాంతితోనే అనుభవిస్తున్నాము. దైవత్వాన్ని దేశ, మత, కాలములకు ఏమాత్రము పోల్చుకొనరాదు.

## ఒకే దైవము అనేక రూపములు ధరించి అనేకమందిని సంతృప్తి పరుస్తున్నాడు

కృష్ణుని విషయము చూడండి. కృష్ణుడు యే తెగకు చెందినవాడు? కృష్ణావతారము బ్రాహ్మణులకు కులదేవతకాదు. క్షత్రియులకు సంపదకాదు. వైశ్యులకు ఒక



sri sathyasai vahamrutam

ఐశ్వర్యముకాదు. ఇది కేవలము లోక సంరక్షణకై అవతరించిన స్వరూపము. కృష్ణుడు నీవాడు, నావాడు అని అనుకోటం కేవలము ఒక విధమైన మమకారమే, అభిమానమే! కృష్ణుడు 'మావాడు' అనుకోటంచేతనే యాదవులలో ముసలము పుట్టి యాదవులందరుకూడను క్షీణించిపోయారు. దైవము అందరివాడు. ఏ ఒక్కరివాడు మాత్రముకాదు. ఉన్నది ఒక్కటే. ఒక్కడే దైవము. ఈ ఒక్కడైన దైవము పెక్కు రూపములు పొంది అనేక విధములైన భ్రాంతులను సంతృప్తి పరుస్తూ వస్తున్నాడు. ఇలాంటి దైవత్వమును మనము అర్థము చేసుకొనవలెనంటే కేవలము సాధన మాత్రమే కాదు. విచారణకూడను అత్యవసరము.

**ఏకత్వమును భిన్నత్వముగా భావించుటచేతనే దివ్యత్వము మరుగున పడిపోతున్నది**

ఈనాడు భిన్నత్వమును ప్రోత్సహించేవారు, అభివృద్ధి పరచేవారు అధికమైపోతున్నారు. ఏకత్వమును అనేకత్వముగా భావిస్తూ వస్తున్నారు. కనుకనే దివ్యత్వమనేది మరింత అడుగున పడిపోతున్నది. లౌకిక సంబంధమైన వ్యామోహములచేతను, వ్యాపారములచేతను యీ దైవత్వమును వేరువేరుగా విభజిస్తూ వస్తున్నారు. దీనివలననే దైవత్వముయొక్క నిజతత్త్వాన్ని మానవులు గుర్తించలేకపోతున్నారు. తద్వారా ధర్మమేమిటో, అధర్మమేమిటో గుర్తించుకోలేక పోతున్నారు. ఏ దేశమున ధర్మదేవత, శాంతిదేవత కళకళలాడుతుందో ఆదేశమునందే సంపత్తి కిలకిలలాడుతుంది. ఈనాడు ధర్మమునకు విరుద్ధముగా, నీతికి విరుద్ధముగా జాతిని ఆధారము చేసుకొని దేశమునందు అనేక విధములైన అశాంతిని అభివృద్ధిపరుస్తున్నారు. అధర్మమును అభివృద్ధిపరుస్తున్నారు. ఇలాంటి అధర్మము అభివృద్ధిపరచే వ్యక్తులను అనేకమంది పెద్దలైనవారు చూస్తున్నారు. జ్ఞానులు, పండితులుకూడను దీనిని పరికిస్తూ వున్నారు. గొప్ప గొప్ప ఉన్నతస్థాయియందున్న అధికారులుకూడను దీనిని చూస్తూ వున్నారు. కాని, ఎవ్వరుకూడను దీనిని అరికట్టలేకపోతున్నారు. ఇది అధర్మమని ఎదుర్కొన లేకపోతున్నారు. ఇట్టివారు తాము స్వయంగా అధర్మము ఆచరించకపోయిననూ అధర్మమును ప్రోత్సహించేవారుగా తోస్తూవున్నారు. దీనికొక చిన్న ఉదాహరణము.

srisathyasaivachanamrutam

## అన్యాయ, అధర్మ, అక్రమములనూ చూస్తూ ఊరకుండినవారు వాటిని ప్రోత్సహించినవారే అవుతారు

మహాభారతమునందు యీ యుద్ధమనేది ప్రపంచమునకే చాలా ప్రమాదము కలిగించేదని గుర్తించి ధర్మజ్ఞుడు కృష్ణుని రాయబారిగా పంపించాడు. నిండుసభలోపల కృష్ణుడు ప్రవేశించి దీనివలన జరిగే ప్రమాదములు, యీయొక్క పరిస్థితులు చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. కృష్ణుని బోధలను మహాజ్ఞానియైన భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యులు, అశ్వత్థామ యిలాంటి పండితోత్తములుకూడను చక్కగా వింటున్నారు. వీరు వినికూడను యే విధమైన వుపయోగము లేకపోయింది. దుష్టులు, దుర్మార్గులు అయిన కౌరవులయొక్క చెంతచేరటంచేత, వారి సహవాసముచేత వీరుకూడను యుద్ధమును ప్రోత్సహించే వ్యక్తులుగా తయారయ్యారు. ఈ అధర్మమును, అక్రమమును గుర్తించిన విదురుడు దానిని యెదుర్కొనుటకు ప్రయత్నించాడు. ఇది మంచిదికాదని, కృష్ణ పరమాత్మయొక్క పవిత్రమైన సూక్తులను అందరు ఆచరణయందుంచి దీనికి తగిన పరిహారము గావించవలెనని అనేక విధములుగా నచ్చచెప్పాడు. కానీ, ప్రయోజనము లేకపోయింది. ఈ దుష్టులు, దుర్మార్గులు అయినవారి చెంతవుండటంకంటె ఏదైనా యాత్రకుపోవటం మంచిదని విదురుడు ఆ రాజ్యమునే విసర్జించి పోయాడు. ఈ భీష్ముడు, ద్రోణాచారి, కృపాచారి వీరందరుకూడను కౌరవుల వుప్పు, పులుసు తినటంచేత వారికి ఏదో ఒక విధమైన సహాయకారులుగా వుండాలని, అభిమాన మమకారములచేత యీ దుష్టులైన వారి రాజ్యమునందే జీవిస్తూ వచ్చారు. అందరు గొప్ప ఆచార్యులే! అందరు ధర్మాధర్మవిషయము గుర్తించినవారే! నిత్యానిత్య విషయములను పరిశీలించినవారే! అయితే, ఆచరణలో లేని వారి జ్ఞానమంతా నిరుపయోగమై పోయింది. కట్టకడపటికి, యుద్ధములో కౌరవులు ఏ విధముగా మరణించిరో అదే విధముగనే యీ ఆచార్యులుకూడను మరణించారు. అన్యాయమును, అక్రమమును ధిక్కరించి దానిని సరిచేసే శక్తి సామర్థ్యములువుండికూడను ఎవరు సరిచేయుటకు ప్రయత్నించరో వారుకూడను దుష్టులతో సమానమే అని భావిస్తూ వచ్చాడు, కృష్ణుడు. మన కంటి ఎదుట యింతటి అన్యాయము, అక్రమము, అనాచారము జరుగుచున్నప్పటికిని మనము చూస్తూ, ఏ మాత్రము ఎదుర్కొనలేక, సరిదిద్ద లేకపోయిన

sri sathyasaivachanamrutam

వ్యక్తులుకూడను ఆ దుర్మార్గముతోకూడిన వ్యక్తులుగానే తయారౌతారు. కనుకనే దుర్మార్గులయొక్క ఫలితాన్ని వీరుకూడను అనుభవించవలసివస్తుంది.

లౌకికముగా మన నిత్యజీవితములో అనుభవించే కొన్ని ఉదాహరణములు. రాత్రి వేళలయందు మనలను యేదో ఒకటో రెండో దోమలు కుడతాయి. నల్లులు కరుస్తాయి. కానీ, యీ బాధను సహించుకోలేక మనము విషసంబంధమైన స్ప్రే చేస్తాము. మనల్ని కుట్టినది కొన్ని దోమలే; అయితే, చచ్చేవి అన్ని దోమలు. కరచినది ఏ ఒకటో రెండు నల్లులైతే దాని సమీపములో వుండిన అనేక నల్లులుకూడను చచ్చిపోతాయి. మనము కఱచిన దానినే చంపుతున్నామా, కుట్టిన దానినే చంపుతున్నామా? అదే విధముగనే దుష్టులు, దుర్మార్గులయొక్కచెంత మనము జీవితాన్ని గడపటముచేత, ఆయొక్క దుష్ట సంబంధమైనదానిని అరికట్టలేకపోవుటచేత మనకుకూడను ఆ ప్రమాదములో ఒక భాగము వుంటున్నాది. దైవముకూడను అన్యాయ, అక్రమ, అనాచారములు జరుగుచున్న సమయములందు దానిని అరికట్టలేని, పరోక్షంగా ప్రోత్సహించే వ్యక్తులను దుష్టసంహారము చేస్తూ వస్తాడు. వీడు పండితుడే, వీడు పామరుడే అనికానీ, వీడు జ్ఞాని, వాడు అజ్ఞాని అనిగానీ యే మాత్రముకూడను చూడడు. 'జ్ఞాని అయితే దీనిని ఎందుకు ఎదుర్కొన లేకపోతివి, ఎందుకు నీకు తెలిసిన సత్యాన్ని వానికి బోధించలేకపోతివి? ఆయొక్క దోషమే నీలో కూడా వుంటున్నది. దోషికి సరైన బోధన చేయని దోషమే నీ దోషము' అని ఆలోచన చేస్తాడు. కనుకనే సమాజములో జరుగుచున్న అన్యాయ, అక్రమ, అనాచారములను సాధ్యమైనంతవరకు ఎదుర్కొని సరిచేసే విషయములో మనము పాల్గొన్నప్పుడే నిజముగా ధర్మసంస్థాపనకు మనము తోడ్పడిన వారమవుతాము.

త్రేతాయుగమునందు రావణుడు చేయుచున్న అన్యాయ, అక్రమ, అనాచారములు చూస్తున్న విభీషణుడు సహించుకోలేకపోయాడు. అనేక విధములుగా తాను అడ్డుతగిలి తన సోదరునికి చాలా విధములుగా బోధిస్తూ వచ్చాడు. కానీ రావణుని ఆగడములు మితిమీరిపోయేటప్పటికి, యీ విభీషణుడు యింక ఆ స్థానమునందే వుండుటకు యిష్టపడక ధర్మమూర్తియైన రాముని పాదములు పట్టాడు. ఆ సమయములో దోషములు

srisathyasaivachanamrutam

గావించినవాడు రావణుడొక్కడే; కాని దోషియైన రావణునికి అనేక విధములైన ఉత్సాహప్రోత్సాహములు యిచ్చిన రాక్షసులుకూడా యీ యుద్ధములో మరణించవలసివచ్చింది. రావణుడు చేసిన దోషములంతాకూడను మెచ్చుకుంటూ వాటిలో పాలు పంచుకుంటూ వచ్చారు, రాక్షసులు. అందుకు వారు శిక్షను అనుభవించక తప్పలేదు. మన బంధువులుగానీ, పుత్రులుగానీ, సన్నిహితసంబంధులుగానీ దోషమును ఆచరించినప్పుడు దానిని ఎదుర్కొంటూ ఆ దోషమును సరిదిద్దుటకు మనము ప్రయత్నించినప్పుడే మనము దోషరహితులౌదుముగానీ, దోషమును ప్రోత్సహించుకుంటూ, దోషమును సమర్థించుకుంటూ వచ్చినవాడు వీడుకూడను దోషియే! కనుక మనము దోషరహితులుగా వుండవలెనన్న దోషమును చూచిన, దోషములు వినిన, దోషములు అనుభవించే స్థానములో వుండిన దానిని సరైన రీతిలో ఎదుర్కొని ఆ దోష పరిహారార్థనిమిత్తమై కొంత ప్రయత్నము చేయాలి.

**ఒక్కొక్కరి విశ్వాసము ఒక్కొక్క పరిమితిలో, పరిధిలో వుంటుంది**

ఏకకాలమందు అనేక విధములైన వ్యక్తిత్వములు ప్రకటితమైనప్పుడు దీనిని భౌతికవాదులు అంగీకరించరు. భౌతికవాదులయొక్క విశ్వాసము కొంత హద్దులో వుంటుంది. ఒక్కొక్కరి విశ్వాసము ఒక్కొక్క పరిధిలో వుంటుంటాది, పరిమితిలో వుంటుంది. ఒక రసాయన శాస్త్రజ్ఞుడే వున్నాడు. తనయొక్క సబ్జక్టులోపల అతడు నిష్ణాతుడు. చాలా గొప్పవ్యక్తి, గొప్ప పరిశీలన చేసిన అనుభవజ్ఞుడు. అయితే, రసాయన శాస్త్రజ్ఞులకు పదార్థ విజ్ఞానశాస్త్రము అంతగా తెలియదు. అంతమాత్రముచేత పదార్థ విజ్ఞానశాస్త్రమును విమర్శించటానికి వీలవుతుందా? ఒక M.B.B.S. చదివిన డాక్టరుకు యింజనీరింగు విషయము ఏమాత్రము అర్థముకాకపోవచ్చు. తన తెలివితేటలు తనయొక్క విద్యయందు మాత్రమే అభివృద్ధి గావించుకోవచ్చు. మరొక విషయమునందు తనయొక్క తెలివితేటలు యేమాత్రముకూడను పనికిరావు. అదే విధముగనే భౌతిక శాస్త్రజ్ఞునియొక్క విశ్వాస పరిమితి, ఆధ్యాత్మిక విశ్వాసముతో పోల్చుకొనుటకు వీలుకాదు. అది చాలా అల్పమైన స్థితి.

srisathyasaivachanamrutam

అలాంటివారికి నిగూఢమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని గుర్తించుకోటము సాధ్యమవుతుందా? ఒక చిన్న ఉదాహరణము. ఇది ఆధునిక యుగము. సాంకేతిక విజ్ఞానము విలసిల్లిన కాలము. ఈ సమయమునందు మనము కొన్నికొన్ని ఉదాహరణలు తీసుకుని వాటి ఆధారంగా దీనిని విశ్వసిస్తున్నాము. ఢిల్లీలోపల ఆకాశవాణిలో ఒక వ్యక్తి తన మాటలు పాటలు ప్రసారము చేయుచున్నాడు. ఢిల్లీలో యీ వ్యక్తి పాటపాడుతూ వుంటే కొన్ని లక్షలమంది తమతమ యిండ్లయందు కూర్చొని రేడియోద్వారా దీనిని వింటున్నారు. ఢిల్లీలో పాటపాడే సమయములో ఆ శృతి, లయ, రాగ, తాళ బద్ధమైన పాటను మనయింటిలో కూర్చుని మనము వింటున్నాము. ఏ విధమైన మార్పుకూడను లేదు. అదే విధముగనే ఢిల్లీలో టెలివిజన్‌లోపల ఎవరో వ్యక్తి మాట్లాడుతున్నాడు. ఆ వ్యక్తి మనకు దూరములో వుండినప్పటికిని మన యింటిలో మన T.V. లో చూస్తున్నాము. మనవలెనే అనేక కోట్లమందికూడ చూస్తున్నారు. ఢిల్లీలో పాడే పాటలు, ఢిల్లీలో మాటలాడే వ్యక్తిని మన యింటిలో మన యెదుట ఉన్నట్లు, కార్యక్రమం జరుగుతున్నట్లు మనం అనుభూతిని పొందుతున్నాము. ఏకకాలములో భిన్న భిన్న ప్రదేశములందు అదే వ్యక్తి అదే మాటలు యేరీతిగా వినగలుగుతున్నారు, ఏ రీతిగా చూడగలుగుతున్నారు, అని ప్రశ్నిస్తే దీనికి వైజ్ఞానిక శాస్త్రంగా అనేక విధములైన సమాధానములు ప్రారంభమవుతున్నాయి. ద్వాపరయుగంలో గోపాలకృష్ణుడు పదహారువేలగోపికల యిండ్లయందు ఒకే పర్యాయము దర్శనమిచ్చాడు. ఒకే పర్యాయము అతనిని చూడగలిగినామని గోపికలు చెబితే దీనికి అనేక విధమైన ప్రశ్నలు, సందేహములు ఎదురవుతున్నాయి. ఇది ఎట్లా జరుగుతుంది, ఇది సాధ్యమా అని కొన్ని విధములైన విమర్శలు తలెత్తుతున్నాయి.

**చిత్తము అనే రేడియోయందు ఏకాగ్రత అనే స్విచ్ వేసి ఆన్ చేసినప్పుడు దివ్యత్వ అనుభూతి కలుగుతుంది**

ఈనాడు యీ మంత్రశక్తికి యే విధమైన అవకాశం లేదని విశ్వసించేవారు యంత్రశక్తిని యేరీతిగా నమ్ముతాము? ఒక యంత్రశక్తియందే యింత పవర్ వుండినప్పుడు యీ మంత్రశక్తిలో ఎందుకుండకూడదు? ఇంతియేకాక, దీని అంతరార్థమును గుర్తించుకొనలేని

sri sathyasai vachanamrutam

మూర్ఖులు దీనిని విమర్శిస్తుంటారు. ఆ ఆకాశవాణిలో వుండిన శబ్ద తరంగములు యే విధముగా మనకు యిక్కడకు వస్తున్నాయి? ఈ శబ్దతరంగములన్నియూ విద్యుత్‌శక్తి తరంగములలో లీనమై, యీ విద్యుత్‌శక్తి తరంగములన్నియుకూడను అనిత్యములైనవి నిత్యముగామారి, అశాశ్వతములైన యీ తరంగములంతా శాశ్వతమైన రూపము ధరించి సర్వత్ర ether అనే దాంట్లో సంచారము జరుపుతూనే వుంటాయి. ఈనాడు మనము రేడియోను గుర్తించిన తరువాత ఢిల్లీలో వుండిన పాటలు మనము ప్రశాంతినిలయములో వింటున్నామని చెప్పగలుగుతున్నామేగానీ ఆనాడుకూడను యీ విద్యుత్‌శక్తి తరంగములలోపల యీ శబ్దతరంగములు లీనమై వుంటున్నాయి. దీనికొక నియమిత కాలపరిమితి వుండనక్కరలేదు. చాలా సంవత్సరాల తరువాతకూడను దీనిని మనము అనుభవించటానికి వీలవుతుంది. ఎట్లనగా దీనికి మరొక ఉదాహరణము. ఘంటసాల శ్రావ్యముగా పాడేవాడు. అతడు మరణించాడు. కానీ యీనాటికికూడను అతనియొక్క స్వరము మనము స్వచ్ఛముగా వినగలుగుతున్నాము. ఏ మద్రాసు రేడియోలోనో అతని పాటల టేపురికార్డువేస్తే దానిని మనము యిక్కడకూడ వినగలుగుతున్నాము. దీనికి కారణమేమిటి? ఈ శబ్దతరంగములు విద్యుత్ తరంగములతోకూడి వుంటున్నాయి. ఈ తరంగములు యేనాటికైనాకూడను, ఎన్ని యుగములకైనా నిలచిపోతుంటాయి. వీరు కనిపెట్టకపూర్వముకూడను యీ తరంగములుంటున్నాయి. అన్ని తరంగములుకూడను సర్వత్ర వ్యాపించి వుంటున్నాయి. అన్ని శబ్దములుకూడను సర్వత్ర వ్యాపించి వుంటున్నాయి. అయితే ఎవరి చిత్తము పరిశుద్ధముగా వుంటుందో అక్కడ మాత్రమే యీ తరంగములు వినబడుతుంటాయి. కనిపిస్తుంటాయి. ఈ ఢిల్లీలో ప్రసారము చేయబడే స్టేషను వేయకుండా మద్రాసు స్టేషను వేస్తే వినబడుతుందా? కనుక ఏ స్టేషనులో పాడుతున్నాడో ఆ స్టేషను సరైన ట్యూన్‌లో పెట్టినప్పుడే మనము వినగలుగుతున్నాము. అదే విధముగనే సర్వత్ర వ్యాపించిన దైవత్వాన్ని మన చిత్తము అనే రేడియోయందు ఏకాగ్రత అనే స్విచ్‌ని వేసి దివ్యత్వమనే ఆనందములో మునిగినప్పుడే ఆ దివ్యత్వమనేది మనకు అర్థమవుతుంది.

**ఒకరి భక్తి, ప్రపత్తులు ఇంకొకరు అర్థము చేసుకోటము చాలా కష్టము**

sri sathyasai vahamrutam

శబ్దతరంగములు ఒక్కటైనాకూడను వ్యర్థము కావటములేదు. ఈ శబ్దతరంగములు సర్వత్ర నిండి వుంటున్నవి. దానిని మనము జ్యోతి తరంగములుగా మార్చుకోవాలి. అదియే ధ్యానశక్తి. అదియే యోగశక్తి. ఇట్టి శక్తిని వారు అనుభవించి ఆనందించటంచేతనే గోపికలకు యీ విధమైన దర్శనము ప్రాప్తించింది. వారి చిత్తములు యెప్పుడును భగవంతునియొక్క రూపముతోనే, నామముతోనే హత్తుకొనిపోయి వున్నాయి. కనుక, యీ విధమైన భక్తి తరంగములకు యేమాత్రము reason అనేది వెదకటానికి అధికారములేదు. ఇలాంటి అనుభూతులు beyond reason. అన్నింటికిని ప్రత్యక్ష ప్రమాణములు వీలుకాదు. ప్రాపంచిక సంబంధమైన చిన్న చిన్న విషయములకే ప్రత్యక్ష ప్రమాణములు యేమాత్రము పని చేయలేనప్పుడు దివ్యత్వమైన, ఆత్మతత్త్వమైన భగవత్ తత్త్వాన్ని యేరీతిగా ప్రమాణములు నిరూపణ చేయగలవు? ఇది కేవలము అజ్ఞానముయొక్క లక్షణము. ఆధ్యాత్మిక తత్త్వమును అర్థము చేసుకున్నవాడు, యీ విధమైన వ్యర్థమైన మార్గములో ప్రవేశించడు. ఎవరెవరి భక్తి భావములు వారికే తెలుసు. ఎవరెవరి భక్తి ప్రపత్తులు వారికే అర్థమవుతాయి. ఒకరి భక్తి ప్రపత్తులు యింకొకరు అర్థము చేసుకోటం చాలా కష్టము.

**తోటి మానవునే నమ్మలేనివాడు నారాయణుని నమ్మగలడా?**

భగవదనుగ్రహము సర్వత్ర నిండుగా దండిగా వుంటూనే వున్నది. కానీ దానికి సూటిగా మన హృదయాన్ని త్రిప్పటంలేదు. ఆ పవిత్రమైన దివ్యత్వమును మన హృదయములో నిండుగా నింపుకోలేదు. కనుకనే మనకు అడుగడుగునా అనుమానములే! క్షణక్షణము మనకు సందేహములే! తనను తానే నమ్మలేకపోతున్నాడు, మానవుడు. నాలుగు నిముషములు నరుని నమ్మలేని మానవుడు నారాయణుని నమ్మగలడా? ఇవన్నీ మన నమ్మకములో వుండిన దోషములేగానీ దైవములో యెట్టి విధములైన మార్పులుగాని చేర్పులుగానీ రావు, లేవు. భగవంతునియందు ధృఢమైన విశ్వాసము కల్గివుండాలి. విశ్వాసము క్షణక్షణమునకు మార్పు చెందరాదు. ఇలాంటి చిత్తశుద్ధిలేనివాడు యెంతకాలము తిరిగినప్పటికిని, ఎన్ని విధములైన సాధనలు చేసినప్పటికిని దైవానుగ్రహమును యేమాత్రము అందుకొనలేడు.

sri sathyasai vahamrutam

## భగవంతుడు నీ హృదయాన్ని మాత్రమే చూస్తాడు

భగవంతుడు నీ హృదయాన్ని మాత్రమే పరిశీలన చేస్తాడు గానీ, నీయొక్క పూజలు, పునస్కారములు చూడడు. ఏ పూజలు చేయకపోయినప్పటికి, ఏ ధ్యానములు చేయకపోయినప్పటికిని, నీ చిత్తశుద్ధిని నీవు సరైన రీతిలో వుంచుకున్నప్పుడే దైవము అందులో ప్రవేశిస్తాడు. గోపికలు మేము మీ వారమని కృష్ణుని ప్రార్థించారు. దీనికి విరుద్ధముగా యాదవులు 'కృష్ణుడు మావాడు' అని విశ్వసించారు. అలా మావాడు అనుకోవడంతోనే అహంకారము పెరిగిపోయింది. అహంకారము యెక్కడవుందునో వాడు అధఃపతనమైపోతాడు. కనుకనే యాదవకులములో ముసలము పుట్టింది. ఎంతకాలమైనప్పటికిని 'స్వామీ! మేము మీ వారమ'ని ప్రార్థించిన గోపికలు ఎప్పటికిని క్షేమసంతోషములు అనుభవించారు. కనుకనే పిల్లలకంతాకూడను నేను మూడు ముచ్చటైన మాటలతో చెప్పాను, మొన్న. నా ముందు నీవు నడచటానికి ప్రయత్నము చేయవద్దు. Don't walk infront of me, I may not follow. Do not walk behind me, I may not lead, walk beside me and be my friend. నా ముందు నీవు నడచటానికి ప్రయత్నము చేస్తివా నీవు నాకుకూడను తప్పు మార్గము చూపవచ్చు. మార్గము నీకు తెలియదు. పోనీ నా వెనకాల ఏమైనా నన్ను అనుసరించటానికి ప్రయత్నము చేస్తివా అంటే నన్ను తప్పించుకొని నీవు వెళ్లవచ్చు. నాప్రక్కనేరా. తప్పించుకొనుటకుగానీ, ముందు నీవు తప్పుమార్గములో పోవుటకుగానీ అవకాశము వుండదు. Because I am with you. నేను నీ వెంటనే వున్నాను. అనగా దీనియొక్క అంతరార్థము ఎమిటి? నీవు, నేను ఒక్కటిగానే వున్నాము. అనగా దైవము సర్వత్రా వుంటున్నాడు. ప్రతి శరీరమునందుకూడను శరీరియై వుంటున్నాడు. ప్రతి దేహమునందు దేహియై వున్నాడు. అలాంటి సమయములో ముందు పోవుటకు వీలుకాదు. కనుకనే దైవమును నీతో కూర్చుకొని రావాలి. దైవాన్ని నీతో చేర్చుకొని రావాలి. ఇదే నిజమైన సాధకునియొక్క లక్షణము.

'ఎక్కడ వుండినాగానీ, స్వామిసేవ మేము చేసుకుంటాము', అని కొందరు అనుకోవచ్చును. కానీ, అంత విశాలహృదయము తనలో లేదుకదా! ఇది కేవలము స్వార్థపరునియొక్క మూర్ఖత్వము. ఇలాంటి పరిస్థితియందు తాను అనేక విధములుగా తన

sri sathyasai vachanamrutam

దోషములను కప్పిపుచ్చుకొని జీవితాన్ని వ్యర్థము చేసుకోవచ్చు. అంత పరిపూర్ణమైన విశ్వాసము వుండిన వానికి ఏ విధమైన వాంఛలు వుండవు. కాని, అట్టి స్థితి లభించేంతవరకు భగవంతుని మనము అనుసరించక తప్పదు. కృష్ణుడు, రాముడుకూడను గురువుల దగ్గర అనేక విద్యలు అభ్యసించి వారిని ఆనందపరచడానికి వారు ప్రయత్నపూర్వకముగా సాధించారు. కనుకనే గురుతత్త్వాన్ని వారు ఇతర శిష్యులకు బోధించగలిగారు. తాను అనుభవించి, ఆనందించి, పదిమందికి పంచాలి. దుష్టవాంఛలు అధికము కావటంచేతను, లౌకికమైన జీవితము పెంచుకోటంచేతను, ప్రపంచమే సత్యమని విశ్వసించటముచేతను, యీ విద్యలు దుష్టబుద్ధులు, పెడమార్గము పడుతూవుంటాయి.

**ఎన్ని విద్యలు నేర్చి యేమిఫలము**
**తన్నొసట వ్రాత తప్పింప నెవరి తరము**
**చెడ్డబుద్ధులు తల చేరేనేని**
**ఎండబారును బుద్ధులు బండబారు**

ఇలాంటి బుద్ధులకు దైవత్వము యేరీతిగా అర్థమవుతుంది? ఇలాంటి మూర్ఖులను మనము చెంత చేర్చుకొని వారితోపాటు మనముకూడా చెడు మార్గమును అనుసరిస్తున్నాము. వారికి తగిన బుద్ధిని చెప్పి, వారిని తగిన మార్గములో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించక పోవటమే మీ దోషము. కనుకనే ఆ దోషములు నీకుకూడను దోషములుగా ఏర్పడుతాయి.

**మనము బాగుపడి, పదిమందిని బాగు చేయటానికి కృషి చెయ్యాలి**

కనుక సమాజములో ప్రవేశించి, జరుగుచున్న దోషములను, జరుగుచున్న అన్యాయములను, అక్రమములను, అనాచారములను సాధ్యమైనంతవరకు ఎదుర్కొని దానిని సరిచేయటానికి తగిన కృషి చెయ్యాలి. ఇట్టి అర్హత వుండినవాడే సమాజసేవకు అధికారి. యిట్టి అధికారమును మనము సంపాదించాలి. ఎట్టి ప్రమాదములు వచ్చినప్పటికిని మనము భయపడనక్కరలేదు. ఎట్టి నిందలు మనకు వచ్చినప్పటికిని మనము వెరవనక్కరలేదు. నిందలు, నిష్ఠూరములు జగత్తుకు మాత్రమే, నీకుకాదు. నీవు నిత్యుడు, సత్యుడు. అలాంటివాడు నిందలు నిష్ఠూరములకు భయపడనక్కరలేదు. దైవ

sri sathyasaivachanamrutam

విశ్వాసమును దృఢము చేసుకొని ఆ విశ్వాసమును మనము ఆచరణలో వుంచి, ఆనందాన్ని అనుభవించినప్పుడు, వెయ్యి ఏనుగులంత బలముకూడను నీకు లభిస్తుంది. 'ధైర్యం సర్వసాధకం'.

నిన్న చెప్పాను, శీలత్రయములని. పవిత్రత, సహనము, ధైర్యము. వీటిని మనము సాధించినప్పుడు ఎన్నింటికైనా మనము సాధించవచ్చు. పవిత్రత లేనివానికే యీ విధమైన సహనము లేకుండాపోతుంది. సహనము లేని వానికే ధైర్యము చాలదు. ఈ ధైర్యము లేనప్పుడు వాడు మహా బలహీనుడైపోతాడు. తాను చెడటమే కాకుండా పరిసరప్రాంతములుకూడను చెడకొడతాడు. ఇలాంటి జీవితము మానవజీవితమే కాదు. కనుక, మనము బాగుపడి, పదిమందిని బాగుచేయటానికి తగిన కృషి చెయ్యాలి. యీ విధమైన మార్గములో పయనిస్తూ యేకత్వమైన దైవత్వాన్ని విశ్వసించి, సర్వమును కోల్పోయినా పరవాలేదు, దైవాన్ని మాత్రము కోల్పోరాదు. అలాంటి నిత్యమైన, సత్యమైన విశ్వాసమును అభివృద్ధి చేసుకోవాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 11-10-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam